
సాక్షి
అనకాపల్లి
గురువారం | 13 | జూన్ | 2024



నిండుకుండలా పెద్దేరు
జలాశయంలో నీటిమట్టం పెరిగి కళకళలాడుతోంది. 375 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.
8లో



డ్రాగన్ ఫ్రూట్ సాగులో..
ఓ రైతు సేంద్రియ విధానంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నాడు. ఏడాదిన్నర కాలంలోనే తొలి విడత పంట దిగుబడి సాధించాడు.
8లో

గరిష్టం/కనిష్టం
31.8/27.5

వాతావరణం
తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

సీనియర్లకు షాక్!

కొలువు తీరిన కొత్త ప్రభుత్వం సీనియర్లకు షాక్ ఇచ్చింది. పార్టీకి సుదీర్ఘ సేవలందించిన నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు మొండిచెయ్యి చూపించారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి మంత్రి వర్గంలో ఒక్కరికే స్థానం కల్పించడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. పలుదఫాలు మంత్రులుగా పనిచేసిన గంటా, అయ్యన్నతో పాటు మూడు నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన వారి ఆశలపైనా నీళ్లు చల్లారు. మరో వైపు జనసేన నాయకులకూ ఇదే పరాభవం ఎదురైంది. గ్లాస్ కోటాలో మంత్రి పదవి ఆశించిన సీనియర్ నాయకుడు కొణతాల ఆశలూ గల్లంతయ్యాయి.



- ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఒకరికే బెర్త్
- మంత్రి పదవి ఆశించి భంగపడ్డ అయ్యన్న, గంటా, పల్లా
- బండారు, వెలగపూడికీ రిక్తహస్తాలు
- జనసేన కోటాలో కొణతాల ఆశలూ గల్లంతు
- అనితకు చోటివ్వడంపై సీనియర్ల గుర్రు



'మినిస్టర్ అయ్యన్నపాత్రుడికి శుభాకాంక్షలు' అంటూ నర్సీపట్నంలో వెలిసిన ఫ్లెక్సీ బోర్డులు

సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రిగా చంద్రబాబు సహా 24 మంది మంత్రులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఒకే ఒక్కరికి మాత్రమే చోటు లభించడంపై సీనియర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సీనియర్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులుండగా రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన అనితకు ప్రాధాన్యమివ్వడంపై టీడీపీ నాయకులు పెదవి విరుస్తున్నారు.

గంటా, అయ్యన్నలకు చెక్ !

టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ ఒకసారి ఎంపీగా, ఏడోసారి ఎమ్మెల్యేగా గెలిచిన చింతకాయల అయ్యన్నపాత్రుడు మూడుసార్లు మంత్రిగా వ్యవహరించారు. ఈసారీ మంత్రి పదవి వస్తుందని ధీమాగా ఉన్న అయ్యన్నకు బాబు తనదైన శైలిలో షాక్ ఇచ్చారు. మంత్రి వర్గంలో చోటు ఇవ్వకపోవడంపై అయ్యన్న కినుక వహించినట్లు తెలుస్తోంది. మరోవైపు.. ఒకసారి ఎంపీగా, ఐదోసారి ఎమ్మెల్యేగా గెలిచిన గంటా శ్రీనివాసరావుకు రిక్తహస్తాలే ఎదురయ్యాయి. రెండుసార్లు మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గంటాకు చంద్రబాబు చెక్ పెట్టారు. అదేవిధంగా.. వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి ఆశించిన వెలగపూడి రామకృష్ణబాబుకు పరాభవం ఎదురైంది. పలుమార్లు పార్టీ కోసం త్యాగాలు చేసి.. రెండోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన పల్లా శ్రీనివాసరావుకి కూడా మంత్రివర్గంలో స్థానం దక్కకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సామాజికవర్గం కోటాలో పల్లాకు రావాల్సిన మంత్రి పదవి కొలుసు పార్థసారథికి కట్టబెట్టినట్లు తెలుస్తోంది. అదేవిధంగా అయ్యన్నకు ఇవ్వాలా.. అచ్చెన్నకు ఇవ్వాలా అనే లెక్కల్లో చంద్రబాబు అచ్చెన్న వైపే మొగ్గు చూపడంతో అయ్యన్నపాత్రుడి వర్గం అధిష్టానం వ్యవహార శైలిపై గుర్రుగా ఉంది. మరోవైపు.. ఒకసారి మంత్రిగానూ, ఐదోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన బండారు సత్యనారాయణమూర్తిని కూడా చంద్రబాబు పక్కన పెట్టేశారు. మూడోసారి గెలిచిన చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకు మొండిచెయ్యి చూపించారు. పార్టీ కోసం విధేయంగా ఉన్న వారితోపాటు సీనియర్లకు మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడంపై విశాఖ టీడీపీ నేతలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు.

గాజు గ్లాసులోనూ అసంతృప్తి జ్వాల

జనసేనలోనూ అదే అసంతృప్తి కనిపిస్తోంది. సీనియర్లుగా ఉన్నవారికి కాకుండా కొత్తగా ఎంపికైన వారికి ప్రాధాన్యమివ్వడంపై నాయకులు పెదవి విరుస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో జనసేన నుంచి నలుగురు ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. నలుగురిలో ఒక్కరికైనా మంత్రి పదవి దక్కుతుందని ఆశించారు. ఒక్కరికి ఇచ్చినా మిగిలిన ముగ్గురు మద్దతునివ్వాలని భావించారు. కానీ.. నలుగురికీ చంద్రబాబు, పవన్ ద్వయం మొండి చెయ్యి చూపించింది. సీనియర్ నాయకులు, మంత్రులుగా పనిచేసిన అనుభవం ఉన్న కొణతాల రామకృష్ణకు, పంచకర్ల రమేష్‌బాబులో ఎవరికో ఒకరికి మంత్రి పదవి వరిస్తుందని భావించారు. కానీ.. వారిద్దరికీ అవకాశం కల్పించలేదు. అదేవిధంగా ఆరేళ్ల ఎమ్మెల్సీగా కొనసాగే అవకాశం ఉన్నా రాజీనామాతో త్యాగం చేసి ఎమ్మెల్యేగా గెలిచిన వంశీకృష్ణకూ మంత్రివర్గంలో స్థానం కల్పించకపోవడంతో నిరాశలో ఉన్నారు. మొత్తంగా సీనియారిటీని పరిగణనలోకి తీసుకోకుండా చేపట్టిన మంత్రివర్గ కూర్పుపై టీడీపీ, జనసేన నేతల్లో అసంతృప్తి కనిపిస్తోంది. అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లోనే విశాఖ జిల్లాను విస్మరించడంపై ప్రజలు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

అరు దశాబ్దాల 'పేట' నుంచి తొలి మంత్రి



నక్కపల్లి: ఆరు దశాబ్దాల పాయకరావుపేట నియోజకవర్గానికి తొలిసారి మంత్రి పదవి లభించింది. 1962లో ఈ నియోజకవర్గం ఏర్పడింది. 14 పర్యాయాలు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ రెండుసార్లు, ఇందిరా కాంగ్రెస్ రెండుసార్లు, టీడీపీ ఏడుసార్లు, వైఎస్సార్‌సీపీ మూడుసార్లు ప్రాతినిధ్యం వహించాయి. అయితే ఆ ఎమ్మెల్యేలు ఎవరూ మంత్రి కాలేకపోయారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సీనియర్లను కాదని ఈసారి వంగలపూడి అనితను మంత్రి పదవి వరించింది. ఉపాధ్యాయినిగా పనిచేస్తూ అనిత 2013లో రాజకీయాల్లో ప్రవేశించారు. 2014లో పాయకరావుపేట నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. 2019లో పార్టీలో అసమ్మతి, గ్రూపుల కారణంగా ఆమెకు పాయకరావుపేట టికెట్ కేటాయించలేదు. పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు నుంచి పోటీ చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభంజనంలో ఓటమి చెందారు. మళ్లీ 2022లో పాయకరావుపేటలో అడుగుపెట్టి నియోజకవర్గ సమన్వయకర్తగా, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా పార్టీ కార్యక్రమాలు చేపడుతూ పట్టు సాధించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ టీడీపీ టికెట్ సాధించి, గెలుపొందారు. ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు, నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి అనిత ప్రమాణ స్వీకారం అనంతరం చెప్పారు.

బడి గంట గణ గణ



- నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- బడుల్లో సర్వం సిద్ధం చేసిన విద్యా శాఖ అధికారులు
- పాఠశాలలకు చేరిన స్టూడెంట్ కిట్లు, పాఠ్యపుస్తకాలు

సాక్షి, అనకాపల్లి : జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలన్నీ గురువారం తెరుచుకోనున్నాయి. 2024–25 విద్యా సంవత్సరం వాస్తవంగా అయితే బుధవారం(జూన్ 12) ప్రారంభం కావాల్సి ఉంది. కానీ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటు, సీఎం ప్రమాణ స్వీకారం ఉన్న కారణంగా వేసవి సెలవులను ఒక రోజు పొడిగించారు. దీంతో గురువారం పాఠశాలలు పునఃప్రారంభమౌతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ప్రాయోజిక పథకంలో భాగంగా ఇప్పటికే సిద్ధమైన విద్యాకానుక కిట్లను మండల కేంద్రాల్లోని స్టాక్ పాయింట్లు నుంచి పాఠశాలలకు సరఫరా చేశారు. బడులు తెరిచిన తొలి రోజునే విద్యాకానుక కిట్లు (స్టూడెంట్ కిట్)లను విద్యార్థులకు అందజేసేందుకు పాఠశాలల్లో తగిన ఏర్పాట్లు చేశారు. విద్యా క్యాలెండర్ మేరకు తరగతులు నిర్వహించడంతో పాటు, సబ్జెక్టుల బోధన సాగేలా పాఠశాలల్లో టైంటేబుల్ ప్రకటించారు. మరో పక్క స్కూళ్లలో అడ్మిషన్లపై విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు. లక్ష్యం మేరకు అడ్మిషన్లు పూర్తయ్యేలా స్పెషల్ డ్రైవ్‌కు కార్యాచరణ సిద్ధం చేశారు.

పుస్తకాలు ఓకే.. విద్యాకానుక లేనట్లే..!

జిల్లాలోని వివిధ మండలాల పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రక్రియకు విద్యాశాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే గాజువాకలో గల బుక్ డిపో నుంచి అనకాపల్లి జిల్లాలో గల వివిధ ప్రభుత్వ పాఠశాలలకు తరలించారు. జిల్లాలో మొత్తం 6,60,075 పుస్తకాలు అవసరం ఉంది. సెమిస్టర్–1లో 4,61,502 పుస్తకాలు, సెమిస్టర్–2లో 1,98,573 పుస్తకాలు అవసరం ఉంది. సెమిస్టర్–1లో 2,13,254 పుస్తకాలు (1,68,712 టెక్ట్ పుస్తకాలు, 44,542 వర్క్ పుస్తకాలు) సప్లయి చేశారు. గతేడాది 2 లక్షల వరకూ పాఠ్య పుస్తకాలు మిగిలాయి. వాటితో కలిపి సెమిస్టర్–1లో పూర్తి స్థాయిలో అందజేస్తారు. నాలుగేళ్లుగా పాఠశాలలు తెరిచిన రోజునే జగనన్న విద్యాకానుక ద్వారా విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, టై, బెల్టు, షూ తదితర సామగ్రి అందజేస్తూ వచ్చారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా పాఠశాలలు తెరిచే నాటికి పుస్తకాల పంపిణీకి రంగం సిద్ధం చేశారు. కానీ విద్యాకానుక మాత్రం పాఠశాలలు పునఃప్రారంభం రోజు లేనట్లే అని విద్యాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

అదుపు తప్పి.. మృత్యు ఒడిలోకి..

పాడేరు ఘాట్‌లో లారీ అదుపు తప్పి బోల్తా పడిన ఘటన తీరని విషాదం నింపింది. రోజుల తరబడి స్టేజ్ లైటింగ్, సౌండ్స్ ఏర్పాటు పనుల్లో రేయింబవళ్లు కష్టపడిన వారంతా కూలి డబ్బులతో ఎంతో ఆశతో ఇళ్లకు బయలుదేరారు. ఇంతలోనే మృత్యువు దారికాసి ముగ్గురు ప్రాణాలను కబళించింది. మరో 12 మందిని ఆస్పత్రి పాల్జేయగా.. వీరిలో ఎనిమిది మంది చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు.

- పాడేరు ఘాట్‌లో బ్రేక్ ఫెయిల్‌తో లారీ బోల్తా
- సంఘటన స్థలంలో ఇద్దరు.. చికిత్స పొందుతూ ఒకరి మృతి
- మరో ఎనిమిది మంది పరిస్థితి విషమం
- నలుగురికి స్వల్పగాయాలు
- జిల్లా ఆస్పత్రిలో అత్యవసర వైద్యం
- బాధితులందరూ దినసరి కార్మికులు
- లైటింగ్, సౌండ్స్ సామగ్రితో వస్తుండగా దారికాసిన మృత్యువు
- మృతులు, క్షతగాత్రులు అనకాపల్లి జిల్లావాసులు







హరీష్,లక్ష్మణ్, అశోక్ మృతదేహాలు



లోయలో పడిపోయిన లైటింగ్, సౌండ్స్ సామగ్రి



పాడేరు ఘాట్‌లో బోల్తా పడిన లారీ

సాక్షి, పాడేరు: వారంతా సాధారణ కుటుంబాలకు చెందిన వారు. కుటుంబ పోషణ నిమిత్తం అచ్యుతాపురంలోని ఎస్ఎస్‌వీ సౌండ్స్‌లో దినసరి వేతనానికి పనిచేస్తున్నారు. జిల్లాలోని పెదబయలు మండల కేంద్రంలో మూడు రోజులపాటు నిర్వహించిన మోదకొండమ్మ ఉత్సవాలకు స్టేజి లైటింగ్, సౌండ్స్ ఏర్పాటు చేశారు. మంగళవారం ఉత్సవాలు ముగియడంతో ఆ సామగ్రితో లారీలో బుధవారం మధ్యాహ్నం అచ్యుతాపురం బయలుదేరారు. వారంతా లారీలో లైటింగ్ సామగ్రిపై కూర్చున్నారు. ప్రయాణం సాఫీగా సాగిపోతుండగా ప్రమాదం సంభవించింది.

ఊహించని ఆపద

పాడేరు ఘాట్‌రోడ్డులో 12వ మైలురాయి గ్రామం వద్దకు వచ్చేసరికి వారికి ఊహించని ఆపద ఎదురైంది. వారు ప్రయాణిస్తున్న లారీకి బ్రేక్‌లు ఫెయిల్ అవడంతో లారీ అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. లారీలో ఉన్న సామగ్రితో కలిపి 15 మంది లోయలో పడిపోయారు. వారిపై సామగ్రి పడిపోవడంతో సంఘటన స్థలంలోనే చోడవరం మండలం బెన్నవోలుకు చెందిన మజ్జి హరీష్ (20), అచ్యుతాపురానికి చెందిన పంచదార్ల లక్ష్మణ్ (20) సంఘటన స్థలంలోనే మృతి చెందారు. తీవ్రంగా, స్వల్పంగా గాయపడిన మిగతా 13 మందిని పాడేరు జిల్లా ఆస్పత్రికి హుటాహుటిన తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యలమంచిలి మండలం షేకిళ్లపాలెంకు చెందిన రాయి అశోక్ (30) ప్రాణాలు విడిచాడు. మిగతా 12 మందిలో లంకా శ్రీను (30), విదర్ల మోహన్ (20), లంకా దీక్షిత (4), భీముని రవి (24), గొర్లె రోహిత్‌కుమార్ (21), సేనాపతి గణేష్ (30), కొన్నిపూడి పవన్ (20), చందక రాజు (20) తీవ్రంగా గాయపడటంతో పరిస్థితి విషమంగా ఉంది. పైల భారతి, ఆదారి నితిన్, లంక సునీతతో పాటు మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిలో పవన్, రాజు, గణేష్‌ను కేజీహెచ్‌కు బుధవారం రాత్రి రిఫర్ చేశారు.

ముగ్గురిలో ఇద్దరు అవివాహితులు..

మృతులు ముగ్గురిలో ఇద్దరు అవివాహితులు. పంచదార్ల లక్ష్మణ్‌కు భార్య, చిన్నారి (4), తల్లి చిలకమ్మ ఉన్నారు. వీరంతా అతని సంపాదనపై ఆధారపడ్డారు. లక్ష్మణ్ మృతితో ఆ కుటుంబం పరిస్థితి దయనీయంగా మారింది. క్షతగాత్రులందరికి తక్షణ వైద్యం అందించేలా కలెక్టర్ విజయ సునీత చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా ఆస్పత్రిని సందర్శించిన ఆమె అత్యవసర వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. మృతులు హరీష్, లక్ష్మణ్, రాయి అశోక్ ఆయా కుటుంబాలకు చేదోడువా దోడుగా నిలుస్తున్నారు. వారి మృతితో ఆయా కుటుంబాలు పోషించే దిక్కును కోల్పోయాయి.

పోలీసుల తక్షణ స్పందన : ప్రమాద సమాచారం తెలుసుకున్న సీఐ నవీన్ కుమార్, ఎస్ఐ లక్ష్మణ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను, క్షతగాత్రులను బయటకు తీసి 108, ప్రైవేట్ వాహనాల్లో హుటాహుటిన పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు బుధవారం రాత్రి పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణలో బంధువుల రోదనలు మిన్నంటాయి. క్షతగాత్రుల్లో షేకిళ్లపాలెం, యలమంచిలి మున్సిపాలిటీ పరిధి సోమలింగపాలెం, కొత్తపాలెంలోని ధర్మవరానికి చెందినవారున్నారు.

స్నేహితులతో వెళ్లి..

యలమంచిలి రూరల్: ప్రమాదంలో మృతి చెందిన యలమంచిలి మండలం షేకిళ్లపాలెం గ్రామానికి చెందిన రాయి అశోక్ ఇంటర్మీడియట్ చదువుతూ మధ్యలో చదువు ఆపేశాడు. స్నేహితులతో కలిసి పాడేరు వెళ్లి ప్రమాదంలో ప్రాణాలు పోగొట్టుకోవడంతో అతని కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. గతంలో ఎప్పుడూ ఇలాంటి కార్యక్రమాలకు వెళ్లని అశోక్‌ను మృత్యువు కబళించడంతో అతని కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. తండ్రి నూకరాజు, తల్లి, సోదరుడు, వదినలు కన్నీరు మున్నీరవుతున్నారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు



పాడేరు జిల్లా ఆస్పత్రిలో క్షతగాత్రుల వైద్య సేవలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ సునీత



పచ్చదనం పల్లవించగా...

- వన నర్సరీల ద్వారా 18 లక్షల మొక్కల పెంపకం
- వర్షాలు పడే సమయానికి రైతులకు పంపిణీ చేసేందుకు చర్యలు
- కొత్త అగ్రహారంలో వన నర్సరీని పరిశీలించిన సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో లక్ష్మణ్



కొత్తూరు వన నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో లక్ష్మణ్

కె.కోటపాడు : రైతులకు వన నర్సరీల ద్వారా ఉచితంగా అందించేందుకు 18 లక్షల వివిధ రకాలైన మొక్కలను అందుబాటులో ఉంచినట్టు సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో జి.లక్ష్మణ్ అన్నారు. కొత్తూరు, రామచంద్రపురం సింగన్నదొరపాలెం, బత్తివానిపాలెంలో గల వన నర్సరీలను బుధవారం ఆయన సందర్శించారు. ఆరోగ్యకరంగా ఉన్న సరుగుడు, టేకు మొక్కలను పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో 20 వన నర్సరీలలో సుమారు 15 లక్షల సరుగుడు, లక్ష టేకు, మరో రెండు లక్షల నేరేడు, బాదం, ఫెల్టోఫారం, కదంబ తదితర మొక్కలను పెంచుతున్నట్టు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటిని రైతులకు అనువైన కాలంలో అందించే చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి శివకుమార్, రేంజ్ అధికారి చంద్రశేఖర్, వన సేవకుడు చిరికి గోవింద పాల్గొన్నారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగులో పట్టభద్రుడు

- మూడున్నర ఎకరాల్లో సాగు చేస్తున్న రైతు కోటేశ్వరరావు
- సేంద్రియ విధానంలో సాగుతో ఆదాయం బాగు
- ఏడాదిన్నర కాలంలోనే తొలి విడత పంట దిగుబడి

చదువులో పట్టభద్రుడు. అయినా వ్యవసాయంపై ఇష్టం ఆయన్ని సాగువేపు దృష్టిసారించేలా చేసింది. సంప్రదాయ వ్యవసాయంలో సాగు ఖర్చులు పెరిగి, నష్టపోతున్న రైతుల దుస్థితిని పరిశీలించాడు. అందుకే వాణిజ్య పంట డ్రాగన్ ఫ్రూట్ సాగుకు మొగ్గు చూపాడు. ఇప్పుడు సిరుల పంట పండిస్తూ.. సహచర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఆయనే కె.కోటపాడు మండలంలోని ఎ.కోడూరుకు చెందిన రైతు లెక్కల కోటేశ్వరరావు.



డ్రాగన్ ఫ్రూట్ సాగుకు అందుబాటులో ఉంచిన సేంద్రియ ఎరువు



ఎ.కోడూరులో సాగులో ఉన్న డ్రాగన్ ఫ్రూట్ పంట



రైతు పండించిన డ్రాగన్ ఫ్రూట్స్

కె.కోటపాడు: సాగు ఖర్చులు పెరిగి, వ్యవసాయంపై రైతుల్లో ఆసక్తి తగ్గుతున్న సమయంలో రైతు కోటేశ్వరరావు డ్రాగన్ ఫ్రూట్స్ సాగుపై దృష్టిసారించారు. గుంటూరు, శ్రీకాకుళం, విజయవాడ ప్రాంతాల్లో సాగు చేస్తున్న రైతుల్ని కలిసి, వారి సాగు విధానాలను పరిశీలించారు. పెట్టుబడి ఖర్చులు, దిగుబడి ద్వారా వచ్చే ఆదాయం గురించి ఆరా తీశారు. చివరికి ఎ.కోడూరులోని తన మూడున్నర ఎకరాల భూమిలో డ్రాగన్ ఫ్రూట్స్ సాగు ప్రారంభించి, లాభాలు ఆర్జిస్తున్నారు.

ఆరంభంలోనే పెట్టుబడి

గుంటూరు, విజయనగరం జిల్లా కిత్తనపేట నుంచి తెచ్చిన డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను తన పొలంలో 2022 జనవరిలో నాటారు. ట్రెల్లీస్, డబుల్ ట్రెల్లీస్ విధానంలో సాగు చేస్తున్నారు. ఎకరా పొలంలో ఈ పంట సాగుకు రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు వెచ్చించారు. 18 నెలల కాలంలోనే తొలి పంట దిగుబడి వచ్చింది. అప్పటి నుంచి 20 ఏళ్ల పాటు పెద్దగా సాగు ఖర్చు లేకుండానే, పంట దిగుబడి ఉండనున్నట్లు రైతు తెలిపారు. తొలి ఏడాది 500 కిలోల దిగుబడి వచ్చిందన్నారు. జూన్ నుంచి నవంబర్ వరకు ఆరుమాసాల పాటు సీజన్ ఉంటుందన్నారు. రెండవ విడత దిగుబడి 7–8 టన్నుల వరకూ రావచ్చని రైతు కోటేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు.

సేంద్రియ విధానంలో సాగు

సేంద్రియ విధానంలో డ్రాగన్ ఫ్రూట్స్‌ను సాగు చేస్తున్నారు. భూమి సారవంతంగా మారేందుకు, మొక్క ఆరోగ్యకరంగా ఉండేందుకు ఆవు, గేదె, కోడి, గొర్రె గెత్తంతో పాటు సుగర్ ఫ్యాక్టరీ నుంచి తెచ్చిన ఫిల్టర్ గెత్తంను ఆరు నెలల పాటు నిల్వ ఉంచి, మొక్కలకు అందిస్తున్నారు. మొక్కలకు తెగుళ్లు, వేరు కుళ్లు సమస్య, చీమల వల్ల నష్టం వాటిల్లే సమయాల్లో వేప నూనెను స్ప్రే చేస్తున్నారు. ప్రతి వారానికి ఒక రోజు మొక్కలకు డ్రిప్ విధానంలో నీటి తడులను అందిస్తూ, పంట ఆరోగ్యకరంగా ఉండేలా చర్యలు తీసుకుంటే చాలు.

అందుబాటులో ఆరు రకాలు

రైతు కోటేశ్వరరావు తన వ్యవసాయ క్షేత్రంలో ఆరు రకాలైన డ్రాగన్ ఫ్రూట్స్‌ను సాగు చేస్తున్నారు. తైవాన్ పింక్, సీఎం రెడ్, జైన్ రెడ్, లాసా రెడ్, జంబో రెడ్, అమెరికన్ బ్యూటీ డ్రాగన్ ఫ్రూట్‌లను పండిస్తున్నారు. సాగులో ఉన్న మొక్కల్లో కొంత భాగంలో డబుల్ ట్రెల్లీస్ విధానంలో ఒకే మొక్కకు రెండు చోట్ల పండ్ల దిగుబడి వచ్చేలా మన రాష్ట్రంలో సాగు చేస్తున్న తొలి రైతు కోటేశ్వరరావే.

ఉష్ణోగ్రతల్ని తట్టుకునేలా చైనా క్లే పిచికారీ

వేసవి సమయాల్లో అధిక ఉష్ణోగ్రతల వల్ల పంట దెబ్బతినకుండా రైతు ప్రత్యేక పద్ధతుల్ని అవలంబిస్తున్నారు. చైనా నుంచి తెచ్చిన ప్రత్యేక మట్టిని నీటిలో కలిపి పంట పై భాగంలో పిచికారీ చేయిస్తున్నారు. దీంతో డ్రాగన్ మొక్క 4 నుంచి 5 డిగ్రీల మేర అధిక ఉష్ణోగ్రతల్ని తట్టుకోగలుగుతుంది. దీని వల్ల పంట దిగుబడి బాగుంటుందని రైతు చెప్తున్నారు.

అవసరమైన రైతులకు సూచనలు



డ్రాగన్ ఫ్రూట్ సాగు రైతులకు లాభసాటిగా ఉంటుంది. ప్రధానంగా ఈ పంటకు ఇసుక నేలలు ఉపకరించనున్నాయి. వర్షాలు పడే సమయంలో నీటి నిల్వ లేకుండా ఉన్న భూములు అయితే పంటకు అనువుగా ఉంటాయి. డ్రాగన్ ఫ్రూట్ సాగుపై ఆసక్తి గల వారికి సాగు సూచనలు అందిస్తాను. డ్రాగన్ ఫ్రూట్ నర్సరీ కూడా అందుబాటులో ఉంది. రైతులకు మొక్కలను పంపిణీ చేస్తాను. సేంద్రియ విధానంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు ఆరోగ్యదాయకం. సాగుపై ఆసక్తి గల రైతులు 98663 81817 నంబర్‌లో సంప్రదించవచ్చు.

– లెక్కల కోటేశ్వరరావు, డ్రాగన్ ఫ్రూట్ సాగు రైతు, ఎ.కోడూరు

'మోదీజీ.. మళ్లీ మట్టి కొట్టకండి'



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

అనకాపల్లి: ప్రధాని మోదీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా హామీని తక్షణమే అమలు చేసి, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ పరిశోధన సమన్వయకర్త బోయిన భానుమూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక గాంధీనగరంలోని జాతిపిత గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులు పట్టుకుని బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగా రాష్ట్రానికి మోదీ నీరు, మట్టి కాకుండా ప్రత్యేక హోదా, పోలవరం, రాజధాని నిర్మాణానికి నిధులు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రతిపాదన ఉపసంహరణ తదితర ప్రయోజనాలు కల్పించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కాళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇప్పటి నుంచే కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ దీనిపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సేనాపతి ఈశ్వరరావు, తుట్టా రమణ, కోట్ని మాణిక్యం, బి.బాలమురళి తదితరులు పాల్గొన్నారు.

'ఐ లవ్ కైలాసగిరి' ప్రారంభం



ఐ లవ్ కైలాసగిరి వ్యూ పాయింట్ వద్ద కలెక్టర్ మల్లికార్జున, వీఎంఆర్డీఏ అధికారులు

ఆరిలోవ(విశాఖ): పర్యాటకులను మరింతగా ఆకట్టుకునేలా ఆధునిక హంగులతో కైలాసగిరిపై వీఎంఆర్డీఏ అధికారులు ఏర్పాటు చేసిన 'ఐ లవ్ కైలాసగిరి'వ్యూ పాయింట్‌ను బుధవారం కలెక్టర్, వీఎంఆర్డీఏ కమిషనర్ ఎ.మల్లికార్జున ప్రారంభించారు. పెద్ద పెద్ద అక్షరాలతో కూడిన బోర్డు ఏర్పాటు చేసి.. రాత్రి వేళల్లో కళ్లు మిరుమిట్లు గొలిపే విధంగా విద్యుత్ దీపాలు అమర్చారు. దీన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ వీఎంఆర్డీఏ అధికారులతో కలిసి ఫొటో దిగారు. కైలాసగిరిపై సందర్శకులను ఆకట్టుకునే విధంగా వ్యూ పాయింట్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

పలు రైళ్ల నంబర్లు మార్పు



తాటిచెట్లపాలెం(విశాఖ): ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో నడుస్తున్న పలు రైళ్ల నంబర్లు జూలై 1వ తేదీ నుంచి మార్పు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు మార్పులను గమనించాలని కోరారు.

- విశాఖపట్నం–కడప–విశాఖపట్నం (17488/17487) తిరుమల ఎక్స్‌ప్రెస్‌లు 18521/18522 నంబర్లతో నడుస్తాయి.
- విశాఖపట్నం–బనారస్–విశాఖపట్నం (18311 / 18312) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లు ఇకపై 18523 /18524 నంబర్లతో నడుస్తాయి.
- విశాఖపట్నం–కిరండూల్–విశాఖపట్నం (18514/18513)నైట్ ఎక్స్‌ప్రెస్‌లు ఇకపై 18527 /18528 నంబర్లతో నడుస్తాయి.
- కటక్–గుణుపూర్–కటక్ (08421 / 08422) ప్యాసింజర్లు ఇకపై 68433/68434 నంబర్లతో నడుస్తాయి
- విశాఖపట్నం–కిరండూల్–విశాఖపట్నం (08551 /08552) ప్యాసింజర్లు ఇకపై 58501/58502 నంబర్లతో నడుస్తాయి.
- విశాఖపట్నం–రాయ్‌పూర్–విశాఖపట్నం (08528 /08527) ప్యాసింజర్లు ఇకపై 58528/58527) నంబర్లతో నడుస్తాయి.
- విశాఖపట్నం–కోరాపుట్–విశాఖపట్నం (08546 / 08545) ప్యాసింజర్లు ఇకపై 58538 /58537) నంబర్లతో నడుస్తాయి.
- విశాఖపట్నం–బ్రహ్మపూర్–విశాఖపట్నం (08531 / 08532) ప్యాసింజర్లు ఇకపై 58532 /58531) నంబర్లతో నడుస్తాయి.
- విశాఖపట్నం–గుణుపూర్–విశాఖపట్నం (08522 / 08521) ప్యాసింజర్లు ఇకపై 58506 /58505) నంబర్లతో నడుస్తాయి.
- విశాఖపట్నం–భవానీపట్నం–విశాఖపట్నం (08504 /08503) ప్యాసింజర్లు ఇకపై 58504 /58503 నంబర్లతో నడుస్తాయి.

ఓ రైలు రద్దు.. మరికొన్ని రీషెడ్యూల్

ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న భద్రతాపరమైన, ఆధునికీకరణ పనుల నిమిత్తం పలు రైళ్లు రద్దు, మరికొన్ని రీ షెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. బుధవారం బయల్దేరాల్సిన తాంబరం–సంత్రగచ్చి (22842) అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

రీ షెడ్యూల్ చేసిన రైళ్లు

- బుధవారం ఉదయం 10.35 గంటలకు బయల్దేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు– హౌరా (12864) ఎక్స్‌ప్రెస్ సుమారు 2గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 12.30 గంటలకు బయల్దేరింది.
- బుధవారం రాత్రి 7 గంటలకు బయల్దేరాల్సిన ఎంజీఆర్ చెన్నై సెంట్రల్– హౌరా (12840) ఎక్స్‌ప్రెస్ సుమారు రెండున్నర గంటలు ఆలస్యంగా రాత్రి 9.30 గంటలకు బయల్దేరింది.
- బుధవారం రాత్రి 11.40 గంటలకు బయల్దేరాల్సిన సంత్రగచ్చి– చెన్నై ఎగ్మోర్ (06080) స్పెషల్ సుమారు నాలుగున్నర గంటలు ఆలస్యంగా గురువారం తెల్లవారు 4 గంటలకు బయల్దేరింది.

పలాస ప్యాసింజర్ గమ్యం కుదింపు

పూండి–నౌపడ సెక్షన్‌లో జరుగుతున్న పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలాస–విశాఖపట్నం –పలాస (07471 / 07470) ప్యాసింజర్ స్పెషల్ ఈనెల 13వ తేదీన శ్రీకాకుళం రోడ్ వరకే రాకపోకలు సాగిస్తుంది.

నేడు పాలిటెక్నిక్ సీట్ల కేటాయింపు

మురళీనగర్(విశాఖ): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి అన్ని ప్రక్రియలు పూర్తయిన నేపథ్యంలో సీట్లను గురువారం కేటాయిస్తారు. జిల్లాలోని కంచరపాలెం గైస్, పాలిటెక్నిక్, పెందుర్తి పాలిటెక్నిక్ హెల్ప్‌లైన్ కేంద్రాల్లో విద్యార్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేశారు. మొత్తం 3,968 మంది తమ సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకున్నారు. గైస్‌లో 1,568 మంది, కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 1,814, పెందుర్తి పాలిటెక్నిక్‌లో 586 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈనెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు విద్యార్థులు వెబ్ ఆప్షన్లు పెట్టుకున్నారు. వెబ్ ఆప్షన్ల సమయంలో కూడా చాలా మంది విద్యార్థులు తమ పేర్లు నమోదు చేయించుకుని సర్టిఫికెట్లు చేయించుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 8 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు, 19 ప్రైవేటు కాలేజీలు ఉన్నాయి. కంచరపాలెం పాలిటెక్నిక్, గైస్, పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్, భీమిలి మహిళా పాలిటెక్నిక్, అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, పాడేరు రెసిడెన్షియల్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు ఉన్నాయి. సీట్లు పొందిన విద్యార్థులు సెల్ఫ్ జాయినింగ్ రిపోర్టును ఆయా కాలేజీల్లో ఈనెల 14వ తేదీ నుంచి 19వ తేదీలోగా ఇవ్వాల్సి ఉంటుంది.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

Paramedical Science and Nursing Courses Admission open now Praveen Institute of Paramedical & sciences. Please Contact : M/s. S.R.Hospital, Near Rythu Bazar, Gopalapatnam, Vizag. Call : Mr. T.Srinivas, General Manager. Ph : 82979 52222 [V- 2587]

Real Estate

FLAT FOR SALE
2BHK, 3BHK Flats for Sale in Bheemili. East & West Facing, Gated Community. Ph : 90592 22202, 98661 26295 [V- 776866]

PLOT FOR SALE
పెందుర్తి, పినగాడి రాయిపూర్ హైవే దగ్గరలో 30 & 40ft తారురోడ్స్‌తో గజం @ 8500/- & L కోట, బొద్దాం దగ్గర 30ft రోడ్స్, లాండ్ కన్వర్షన్, మామిడి, నిమ్మ, కొబ్బరి మొక్కలతో గజం @ 4,500/-. ఫోన్: 98859 57795 [V- 2589]

Services

BUSINESS OFFER
జిడిపేసు రూ. 600/- తో గాని 1200/- లతో గాని "మా ద్వారా" జమవు చేసుకొన్నవారికి "GIFT MONEY", మీరు కొనిపించడం ద్వారా "HAPPPY MONEY", ONLINE సర్వీసులద్వారా CASH BACK. 63001 72408 [V- 2589]

GOLD LOANS
లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12047]

OLD AGE HOME
Elder Home గాజువాక & అక్కయ్యపాలెం వృద్ధుల ఆశ్రమం. వృద్ధులకు మంచాన వున్న వారికి మంచి వాతావరణం, ఆరోగ్యకరమైన భోజనం 24 గం॥ వైద్యసేవలు. హోమ్‌కేర్ సర్వీస్ కలదు. ఫోన్: 87904 49799, 90103 92178 [V- 786884]

Wanted

మర్చంట్ నేవీలో ఖాళీలు పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కంపెనీ ఖాళీలు. విభాగం: ఇంజిన్, డెక్, కుక్. వయసు : 18–28. అర్హత:10వ తరగతి ఉత్తీర్ణత & అంతకంటే ఎక్కువ. Sailorswave Ship Management Pvt. Ltd. Hyderabad (Telangana), Palakkad (Kerala) Ph: 7893682065. [H-778921]


గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి :9010546644
యలమంచిలి :9951602901
చోడవరం :9010210265
నర్సీపట్నం :9010234557
పాడేరు : 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

నిండుకుండలా పెద్దేరు



ప్రధాన మూడవ గేటు ద్వారా వరద నీరు విడుదల చేస్తున్న దృశ్యం

- జలాశయంలో పెరిగిన నీటి మట్టం
- 375 క్యూసెక్కులు దిగువకు విడుదల

మాడుగుల : ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దేరులోకి 70 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో జలాశయంలో గణనీయంగా నీటిమట్టం పెరిగింది. జలాశయం గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 136.60 మీటర్లకు చేరుకుంది. దీంతో జలాశయం మూడో గేటు ద్వారా 375 క్యూసెక్కుల వరద నీటిని పెద్దేరులోకి విడుదల చేస్తున్నారు. పెద్దేరు జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో అడపాదడపా కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరుతోందని జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. గత ఏడాది ఇదే సమయానికి జలాశయంలో 132 మీటర్ల నీటి మట్టం ఉండేది. ఈ ఏడాది నీటినిల్వలు గణనీయంగా పెరగడంతో పెద్దేరు ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆయకట్టుకు ఢోకా లేదు

పెద్దేరు జలాశయంలో నీటి నిల్వలు అధికంగా చేరడంతో ఆయకట్టు పరిధిలో 15 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేయడానికి రైతులు వరి నారుమడులు సిద్ధం చేసుకున్నారు. మరో వారం రోజుల్లో ఖరీఫ్ వరి నారు వేయడానికి రైతులు విత్తనాలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ ఏడాది ముందుగానే తొలకరి వర్షాలు అనుకూలించడంతో వేసవి దుక్కులు అనంతరం ఇప్పటికే మండలంలో 2 వేల ఎకరాల్లో అపరాలు సాగు చేశారు. 1000 ఎకరాల్లో చెరకు తోట ఉడుపులు వేశారు. ప్రస్తుతం రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నారు.

యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్వో మోహన్‌కుమార్

మహారాణిపేట(విశాఖ): జిల్లాలో ఈనెల 16వ తేదీన నిర్వహించనున్న యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు సంబంధించి సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా 26 కేంద్రాల్లో పరీక్షను రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. మొత్తం 9,635 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నారని వివరించారు. పరీక్షా కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలన్నారు. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో యూపీఎస్సీ అధికారులు, పర్యవేక్షకులు, లైజన్ అధికారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బాల కార్మిక సంక్షేమ చట్టాలపై అవగాహన



కార్మిక చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వీరరాఘవేంద్రరావు

కశింకోట: బాల కార్మికుల సంక్షేమ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని యలమంచిలి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ టి.వీరరాఘవేంద్రరావు అన్నారు. మండలంలోని నూతలగుంటపాలెం వద్ద సన్ ఫుడ్ ఫ్యాక్టరీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్యాక్టరీ కార్మికులతో బుధవారం సమావేశం నిర్వహించారు. బాల కార్మిక సంక్షేమ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌సీజీ కోర్టు ఏజీపీ డి.వెంకటరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.నూకరాజు, కార్యదర్శి బి.హరిశంకరరావు, ఉపాధ్యక్షుడు పి.వి.రమణ, ఫ్యాక్టరీ ఎండీ బి.అనిల్‌కుమార్, లేబర్ ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ సైన్స్, టెక్నాలజీ కోర్సులో ప్రవేశాల గడువు పెంపు

ఏయూక్యాంపస్ : ఏయూలో నిర్వహిస్తున్న బీఎస్సీ –ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్,టెక్నాలజీ కోర్సులో ప్రవేశాల గడువును ఈ నెల 26కు పొడిగించినట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 28న ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. దరఖాస్తు చేసిన విద్యార్థులు నేరుగా కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాల కోసంwww.audoa.andhrauniversity.edu.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

పురుగు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి లింగాలపాలేనికి చెందిన బి.సురేష్‌కుమార్(34) పురుగు మందు సేవించి ఈ నెల 11న ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. టౌన్ సీఐ కాంతి కుమార్ అందించిన వివరాలు. మృతుడు సురేష్ మద్యానికి బానిసయ్యాడు. మద్యం సేవించవద్దని ఇంట్లో వారు మందలించారు. దీంతో మృతుడు బలిఘట్టం మద్యం షాపు వద్ద పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

అయినసూ.. కట్టవలే..!

- 'బీహెచ్' వాహనదారులు పన్ను చెల్లించాల్సిందే..
- లేకుంటే కేసు నమోదు.. సీజ్
- ఇతర రాష్ట్రాల్లో ఈ రిజిస్ట్రేషన్‌తో ఇక్కడ తిరుగుతున్న కార్లు
- ఆంధ్రలోనూ ట్యాక్స్ చెల్లిస్తేనే అనుమతి
- అడ్డదారుల్లో రిజిస్ట్రేషన్లు చేయించిన 14 మంది డీలర్‌షిప్‌ల రద్దు



బీహెచ్ సిరీస్ రిజిస్ట్రేషన్ వాహనం

సాక్షి, విశాఖపట్నం: ఒకే దేశం.. ఒకే రిజిస్ట్రేషన్ (వన్ నేషన్.. వన్ రిజిస్ట్రేషన్) విధానంతో కేంద్ర ప్రభుత్వం గతంలో బీహెచ్ రిజిస్ట్రేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. బీహెచ్ (భారత్) సిరీస్‌తో రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వాహనాలు దేశంలో ఎక్కడైనా తిరగొచ్చన్న భావన పలువురిలో ఏర్పడింది. కేవలం కేంద్ర ప్రభుత్వం/ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు/నాలుగు అంతకు మించి ఎక్కువ రాష్ట్రాల్లో కార్యాలయాలున్న ప్రైవేటు కంపెనీల ఉద్యోగుల వాహనాలకు మాత్రమే బీహెచ్ రిజిస్ట్రేషన్ వెసులుబాటు కల్పించారు. వీరు తాము పనిచేసే ప్రదేశం ఉన్న రాష్ట్రంలో లేదా శాశ్వత చిరునామా కలిగిన రాష్ట్రం, ఈ రెండింటిలో ఏ ప్రదేశంలో వాహనాన్ని ఉపయోగించాలనుకుంటారో ఆ రాష్ట్రంలో వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేసుకొని, సంబంధిత రాష్ట్ర మోటారు వాహన పన్నును చెల్లించాల్సి ఉంటుంది. ఇతరులు ఈ బీహెచ్ రిజిస్ట్రేషన్ సిరీస్‌కు అర్హులు కాదు. అయితే కొంతమంది వ్యాపారులు, ఇతర ఉద్యోగులు స్థానికంగా ఉంటూ ఇతర రాష్ట్రాల్లో నివాసం ఉంటున్నట్టు తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించి తమ వాహనాలకు బీహెచ్ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. రాష్ట్రాలకు చెల్లించాల్సిన మోటారు వాహనాల పన్ను ఎగవేయవచ్చన్న ఉద్దేశంతో వీరు ఆ మార్గాన్ని ఎంచుకున్నారు. కొంతమంది వాహన డీలర్లు ఇలా అడ్డదారుల్లో బీహెచ్ సిరీస్ రిజిస్ట్రేషన్లు చేయించుకోవడంలో కీలకపాత్ర పోషించారు. నిబంధనల ప్రకారం ఈ సిరీస్ రిజిస్ట్రేషను నంబరు కలిగిన వాహనాలు ఆ రాష్ట్రంలోనే తిరిగేందుకు అనుమతి ఉంటుంది. ఇతర రాష్ట్రాల్లో తిరగాలంటే సంబంధిత రాష్ట్రానికి పన్ను చెల్లించాలి. కానీ కొంతమంది వాహనదారులు అరుణాచల్‌ప్రదేశ్ సహా మరికొన్ని రాష్ట్రాల్లో బీహెచ్ రిజిస్ట్రేషన్లు చేయించుకుని ఆంధ్రప్రదేశ్‌కు పన్ను చెల్లించకుండా మన రాష్ట్రంలోనూ తిరుగుతున్నట్టు రవాణా శాఖ అధికారులు కొన్నాళ్ల క్రితం గుర్తించారు. ఒక్క విశాఖపట్నం జిల్లాలోనే 400 వరకు ఇలాంటి వాహనాలున్నట్టు అంచనాకొచ్చారు. వీటిలో 80 శాతం నేవీ, 10 శాతం కేంద్ర ప్రభుత్వం/ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల వాహనాలు కాగా 10 శాతం వాహనాలు అడ్డదారుల్లో బీహెచ్ రిజిస్ట్రేషన్లు చేయించినవి ఉన్నాయి. రాష్ట్రానికి మోటారు వాహన పన్నులు చెల్లించకుండా తిరుగుతున్న వాహనదారులకు రవాణా శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇలా ఇప్పటి వరకు వీరిలో 35 మంది రూ.కోటి వరకు పన్ను చెల్లించారు.

లేదంటే ఏపీ రిజిస్ట్రేషనే..

ఇతర రాష్ట్రాల్లో బీహెచ్ రిజిస్ట్రేషన్లు చేయించుకుని రాష్ట్ర ప్రభుత్వానికి వాహన పన్ను చెల్లించకుండా విశాఖలో తిరుగుతున్న వాహనాలపై కేసులు నమోదు చేస్తామని రవాణా శాఖ ఉప కమిషనర్ జీసీ రాజారత్నం 'సాక్షి'కి తెలిపారు. అంతేకాదు.. అలాంటి వాహనాలను సీజ్ చేసి వారి నుంచి పన్ను రికవరీకి చర్యలు చేపడతామన్నారు. లేనిపక్షంలో ఆ వాహనదారులు బీహెచ్ రిజిస్ట్రేషన్‌కు బదులు ఏపీ రిజిస్ట్రేషన్ మార్చుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా అడ్డదారుల్లో బీహెచ్ సిరీస్ రిజిస్ట్రేషన్లు చేయించిన 14 మంది వాహన డీలర్ల ఆథరైజేషన్‌ను సస్పెండ్ చేశామని చెప్పారు.

క్లుప్తంగా

మలేరియా నియంత్రణకు అవగాహన ర్యాలీ



తేగాడలో మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

కశింకోట: మండలంలోని తేగాడలో ఉన్న హెల్త్ వెల్‌నెస్ కేంద్రంలో బుధవారం మలేరియా మాసోత్సవాలను జరిపారు. కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మలేరియా నియంత్రణపై అవగాహన కలిగిస్తూ ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రామ్మూర్తి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం నీటిని నిల్వ చేసే పాత్రలను ఖాళీ చేసి, ఆరబెట్టాలన్నారు. పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూడాలని సూచించారు. టైర్లు, డబ్బాలు, రుబ్బు రోళ్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, కొబ్బరి చిప్పల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. లేకుంటే అందులో దోమలు వృద్ధి చెంది, మలేరియాకు కారణమవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఉదయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ సంతోషి, హెల్త్ అసిస్టెంట్ సుభాని పాల్గొన్నారు.

ఘనంగా గణపతి ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నక్కపల్లి : మండల కేంద్రం నక్కపల్లి వెంకటనగర్ కాలనీలో ఉన్న సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారికి హోమాలు, పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించారు. భక్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నక్కపల్లి, కొత్తపేట, రాజీవ్‌నగర్‌కాలనీ, బండారు పేట, అప్పలపాయకరావుపేట తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలి వచ్చిన స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

అనకాపల్లి సినిమాలు

గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి	:రాజా
మనమే	:సత్యనారాయణ స్క్రీన్-1
గం గం గణేశా	:సత్యనారాయణ స్క్రీన్-2
బ్యాడ్ బాయ్స్(రైడ్ ఆర్ డై)	:షిర్డిసాయి
లవ్ మౌళి	:పర్దిసాయి
సత్యభామ	:వెంకటేశ్వర
రక్షణ	: శ్రీసత్య
భజే వాయు వేగం	:రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 325 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,470	5,270
రెండో రకం	4,200	4,400
మూడో రకం	3,800	4,010

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 52 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-15 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-16 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 381 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 365 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (0892 4223595)ని సంప్రదించవచ్చు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
✆ 9966329167, 9912440601

'హైస్కూల్ ప్లస్'తో ఇంటర్ జోష్

పదో తరగతి తర్వాత పేద, దిగువ మధ్య తరగతి విద్యార్థినుల్లో డ్రాపౌట్స్ ఎక్కువ. గ్రామీణ ప్రాంతాల్లో ఆ సంఖ్య మరీ అధికం. ఊరు దాటి ఎక్కువ దూరం ఆడపిల్లల్ని పంపేందుకు తల్లిదండ్రుల్లో ఉన్న భయాందోళనలే కారణం. అందుకే గత ప్రభుత్వంలో మండలానికి కనీసం ఒకటి చొప్పున బాలికల జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. మండలంలోని కూండ్రం హైస్కూల్‌ను అప్‌గ్రేడ్ చేసి, హైస్కూల్ ప్లస్‌గా మార్చారు. ఈ ఏడాది విద్యార్థినుల ప్రవేశాలు కూడా జోరందుకున్నాయి.

- కూండ్రం హైస్కూల్ ప్లస్‌లో ఫస్టియర్ అడ్మిషన్లు
- ఈ ఏడాది నుంచి ఎంపీసీ గ్రూప్‌లో ప్రవేశాలు
- కార్పొరేట్‌కు దీటుగా ఇంటర్ బోధన



ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థులతో సిబ్బంది



కూండ్రం హైస్కూల్ ప్లస్‌లో కొత్తగా చేరిన ఇంటర్ విద్యార్థులు

అనకాపల్లి: పట్టణ, మండల పరిధిలో బడుగు, బలహీన వర్గాల ఆడపిల్లలకు ఉన్నత విద్యను మరింత చేరువ చేయాలన్న లక్ష్యంతో ఏర్పాటైనవే హైస్కూల్ ప్లస్‌లు. గతేడాది నుంచి బాలికల ఇంటర్ విద్య కోసం వీటిని ప్రారంభించారు. పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నారు. మనబడి నాడు-నేడు పథకంలో కూండ్రం హైస్కూల్‌ను అభివృద్ధి చేసి, హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. 2022-23 విద్యా సంవత్సరంలో బైపీసీ గ్రూప్ మాత్రమే ప్రారంభించారు. ఈ ఏడాది బైపీసీతోపాటు, ఎంపీసీ గ్రూపులో కూడా ప్రవేశాలు నిర్వహిస్తున్నారు.

తొలి ఏడాది 20 మంది చేరిక

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో ఏవైనా రెండింటిని ప్రారంభించే వీలుంది. అయితే మండలంలోని కూండ్రం హైస్కూల్ ప్లస్‌లో గతేడాది బైపీసీ గ్రూప్ మాత్రమే ఏర్పాటు చేశారు. 20 మంది విద్యార్థినులు చేరారు. వారిలో 15 మంది ఫస్టియర్ ఇంటర్ ఉత్తీర్ణులయ్యారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో సెకండియర్ బైపీసీలో 20 మంది విద్యార్థినులు కొనసాగుతున్నారు. చాలినంత సిబ్బందిని నియమించడంతో బోధనపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెరిగింది.

ఈ ఏడాది నుంచి రెండు గ్రూపులు

ఈ ఏడాది ఫస్టియర్ ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ఎంపీసీ గ్రూప్ కూడా ప్రారంభించడంతో హైస్కూల్ ప్లస్‌కు భవిష్యత్తులో ఆదరణ బాగుంటుందని సిబ్బంది చెప్తున్నారు. ఒక్కో గ్రూప్‌లో 40 సీట్ల వరకు ప్రవేశాలు తీసుకుంటారు. తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో బోధన ఉంటుంది. ప్రస్తుతానికి ఎంపీసీలో ముగ్గురు, బైపీసీలో 8 మంది ప్రవేశాలు పొందారు. వీరికి అవసరమైన పాఠ్యపుస్తకాలను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుంది. ఈ సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని బోధనా సిబ్బంది చెప్తున్నారు.



కూండ్రం హైస్కూల్ ప్లస్

ఇంటర్‌కు ఆదరణ



హైస్కూల్లో ఇంటర్మీడియట్ బోధన బాగుంది. గతేడాది ఇంటర్ తరగతులు ప్రారంభించాం. కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నాం. హైస్కూల్లో చదివిన విద్యార్థులు ఇంటర్లో చేరుతున్నారు. అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందిస్తున్నాం. స్కూల్లో ప్రవేశాలకు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది ఇంటర్లో 11 మంది విద్యార్థులు చేరారు.

– ఎం.కె.భాస్కరం, హెచ్ఎం, కూండ్రం హైస్కూల్

ఆటపాటలతో బోధన

ప్రభుత్వ పాఠశాలల్లో ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నారు. విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంలు అందిస్తోంది. ఆధునిక పరిజ్ఞానంతో కూడిన డిజిటల్ తరగతి గదుల్లో ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. తొలి దశగా కూండ్రం హైస్కూల్లో ఇంటర్మీడియట్ విద్యను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విద్యార్థుల నుంచి స్పందన బాగుంది.

– కె.కోటేశ్వరరావు, ఎంఈవో-2, అనకాపల్లి

దేవస్థానం చైర్మన్ పదవికి రాజీనామా

అనకాపల్లి:స్థానిక సుంకరమెట్ట సూర్యనారాయణ, సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ కేఎం నాయుడు బుధవారం చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆలయ ఈవో కీర్తి ఆదినారాయణకు రాజీనామా పత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల తీర్పును అంగీకరిస్తూ తన పదవికి రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. భక్తునిగా ఆలయ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు. ఆలయ సిబ్బందికి వస్త్రాలు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు పెంటకోట అప్పలనాయుడు, విజ్జపు వాసుముకుంద, మారిశెట్టి శ్రీను, తాడి నాగలక్ష్మి, తగరంపూడి నర్సింగరావు, ఎక్స్ అఫీషియో సభ్యుడు మవుదూరి విద్యాసాగర్ పాల్గొన్నారు.



ఈవో కీర్తి ఆదినారాయణకు రాజీనామా పత్రాన్ని అందిస్తున్న కేఎం నాయుడు

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



శస్త్ర చికిత్స అవసరమైన వారిని బస్సులో ఆస్పత్రికి తీసుకెళ్తున్న శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు

- శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్సకు 55 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న శంకర్ ఫౌండేషన్ వైద్యులు

తుమ్మపాల: కంటిచూపు మందగించిన వారికి శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేసి, కంటి అద్దాలతో పాటు, అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నట్లు కంటి వైద్య నిపుణులు హరిచందన, మేఘన, కోఆర్డినేటర్ సీహెచ్ అశ్వనీకుమార్‌లు తెలిపారు. మండలంలోని తుమ్మపాల శ్రీ పోలపల్లెమ్మ ఆలయం వద్ద వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సిబ్బందితో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కంటి సంబంధిత సమస్యలతో శస్త్రచికిత్స అవసరమైన 55 మందిని గుర్తించి, శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. గ్రామంలో చేపట్టిన కంటి వైద్య శిబిరంలో 200 మందికి పైగా రోగులు వైద్య సేవలు పొందినట్లు వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ యేరుబండి సత్యనారాయణ పేర్కొన్నారు. బస్సులో ఉచితంగా తీసుకెళ్లి, కంటి ఆపరేషన్లు చేస్తున్న శంకర్ ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. శిబిరంలో ప్రముఖ వైద్యులు డీడీ నాయుడు, గ్రామపెద్దలు దంతులూరి దిలీప్‌కుమార్, నడిపల్లి గణేష్, బొడ్డపాటి చినరాజారావు, మర్తురి ఉమామహేశ్వరరావు, కోసూరి బాబూరావు, స్టాఫ్ నర్స్ దేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంఏఎల్ కళాశాల నాక్ గ్రేడింగ్‌కు కృషి

తుమ్మపాల: ఏఎంఏఎల్ కళాశాలకు నాక్ గ్రేడింగ్ వచ్చేలా పలు కార్యక్రమాలు చేపట్టాలని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బొడ్డేడ అప్పారావు అన్నారు. మండలంలోని కొత్తూరులో ఉన్న కళాశాలలో బుధవారం పూర్వ విద్యార్థుల సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. జిల్లా కేంద్రంగా పట్టణానికి సమీపంలో ఉన్న కళాశాలకు ప్రత్యేక గుర్తింపు కోసం కృషి చేయాలన్నారు. త్వరలో పూర్వ విద్యార్థుల సంఘ వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ గల్లా జయబాబు, కార్యవర్గ సభ్యులతో కలిసి కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల పర్యవేక్షకురాలు పెంటకోట అనురాధ, కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు, కోశాధికారి వై.జగదీశ్వరరావు, సంఘ సభ్యులు బుద్ధ కాశీవిశ్వేశ్వరరావు, రాజేశ్వరీప్రసాద్, కొణతాల రామచంద్రరావు, ఐక్యూఏసీ కన్వీనర్ నిరంజన్‌కుమార్ పాల్గొన్నారు.



ఏఎంఏఎల్ కళాశాలలో మొక్కలు నాటుతున్న పూర్వవిద్యార్థి సంఘ నాయకులు

యువత స్పందించారు.. చెట్టు తొలగించారు



చెట్టును నరికి పక్కకు తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

పరవాడ: ఇటీవల కురిసిన వర్షాలకు స్థానిక సినిమాహాలు కూడలి-పరవాడ మధ్య కూలిన చెట్టును పరవాడ బ్యాడ్ బాయ్స్ యూత్ సభ్యులు మంగళవారం రాత్రి తొలగించి మానవవతాదృక్పథం చాటుకున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షానికి మండలంలో అనేక చోట్ల చెట్లు కూలిపోయాయి. పరవాడ రహదారిలో కూడా భారీ వృక్షం కూలిపోవడంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. అధికారులు మాత్రం పట్టించుకోలేదు. ఈ విషయాన్ని 'సాక్షి'లో ప్రచురించడంతో ఎవరో వస్తారు అని ఎదురు చూడకుండా బ్యాడ్ బాయ్స్ యూత్ సభ్యులు రోడ్డుపై కూలిపోయిన చెట్టును నరికి పక్కకు తొలగించారు. దీంతో యూత్ సభ్యులను పలువురు అభినందించారు.

నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభం

అచ్యుతాపురం : అచ్యుతాపురం మండలంలోని 58 ప్రభుత్వ పాఠశాలలతో పాటు, ప్రైవేట్ పాఠశాలలు గురువారం తెరచుకోనున్నాయి. వేసవి సెలవుల అనంతరం 12న బడులు తెరచుకోవాల్సి ఉండగా, సీఎం ప్రమాణ స్వీకార నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాల కోరిక మేరకు ఒక రోజు సెలవును పొడిగించారు. మండలంలో ప్రస్తుతం 4,800 మంది విద్యార్థులుండగా, 350 మంది టీచర్లు పనిచేస్తున్నారు. ఈసారి ఇవ్వనున్న విద్యా కానుక కిట్‌ను స్టూడెంట్ కిట్‌గానూ, మధ్యాహ్నం భోజనాన్ని పోషణ గోరుముద్దగానూ మార్చారు. ఇప్పటికే గత ప్రభుత్వం ముద్రించిన పాత సీఎం ఫొటోల స్థానంలోనూ, వారి పేర్ల స్థానంలోనూ స్టిక్కర్లు అంటించే పని చేపట్టారు.

రెండు రోజుల్లో విద్యార్థులకు కిట్‌ల పంపిణీ

మునగపాక : మునగపాక ఎంఆర్‌సీ భవనం నుంచి పాఠశాలలకు పంపిణీ చేస్తున్న స్టూడెంట్(విద్యా కానుక) కిట్లను బుధవారం డీఈవో వెంకటలక్ష్మమ్మ పరిశీలించారు. కిట్‌ల నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు రోజుల్లోగా విద్యార్థులకు కిట్లను అందజేయాలని ఆదేశించారు. పంపిణీలో జాప్యం లేకుండా చూడాలని ఎంఈవో 1, 2లు వేణుగోపాలరావు, శివనాయుడులను కోరారు. ఆమె వెంట సీఆర్పీలు కర్రి లక్ష్మీనారాయణ, బి.అచ్యుతకృష్ణ, ఎం.గోవింద, సత్తిబాబు, నూకేష్ తదితరులు పాల్గొన్నారు.



స్టూడెంట్ కిట్లను పరిశీలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

వాడ్రాపల్లిలో ఉచిత వైద్య శిబిరం



మెరుగైన వైద్యం కోసం బస్సులో బయలుదేరుతున్న వాడ్రాపల్లి గ్రామస్తులు

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. విశాఖకు చెందిన గాయత్రి విద్యాపరిషత్ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ఇటువంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా శిబిరానికి హాజరైన రోగులను పరీక్షించిన వైద్యాధికారి ఈవీ శివకుమార్ 47 మంది అనారోగ్యంతో బాధపడుతున్నట్టు గుర్తించి వారిని ప్రత్యేక బస్సులో తరలించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు



రైతులకు పంపిణీకి సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు

రాంబిల్లి: రైతులకు పంపిణీ చేసేందుకు వరి విత్తనాలు అందుబాటులోకి వచ్చాయి. మండలంలో పలు ఆర్‌బీకేలకు 138 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులోకి వచ్చినట్లు ఏవో ఎ.సుమంత తెలిపారు. బీపీటీ రకంతో పాటు ఎంటీయూ 1224, ఎంటీయూ 1318 రకం వరి విత్తనాలు బస్తాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, అలాగే రైతులు ఎక్కువగా సాగు చేసే ఆర్‌జీఎల్ రకం వరి విత్తనాలు మాత్రం గురువారం వస్తాయని ఏవో పేర్కొన్నారు. ఈ విత్తనాలను మొలక కట్టి మొలక శాతం పరీక్షించిన తర్వాతే రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

జంగిల్ క్లియరెన్స్ చేపట్టరూ..

కోటవురట్ల : గ్రామీణ రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఇటీవల అడపదడపా కురిసిన వర్షాలకు రహదారులకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. ప్రధానంగా మలుపుల్లో దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎదుట వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రామచంద్రపాలెం నుంచి నీలిగుంట వెళ్లే రహదారితో పాటు లింగాపురం, రాజుపేట, అన్నవరం, గొట్టివాడ వెళ్లే రహదారుల్లో పిచ్చిమొక్కలు దట్టంగా అలుముకున్నాయి. అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేయించాలని పలువురు కోరుతున్నారు.



నీలిగుంట రహదారిలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

కొనసాగుతున్న మహిళల ధర్నా



పెదకలవలాపల్లి ధర్నా నిర్వహిస్తున్న మహిళలు

రాంబిల్లి: పెదకలవలాపల్లిలో మహిళా రైతులు, కూలీలు నిర్వహిస్తున్న ధర్నా బుధవారం కొనసాగింది. అటవీ భూముల చుట్టూ నేవీ ప్రహరీ గోడను నిర్మిస్తుంది. ఈ ప్రహరీ కారణంగా దశాబ్దాల కాలంగా తమ సాగులో ఉన్న భూములు కోల్పోయామని, అలాగే తమ పంట పొలాల్లోకి వెళ్లే దారులు మూతబడుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తమ ఇబ్బందులను అధికారులు పరిశీలించి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

కూటమి శ్రేణుల సంబరాలు

కశింకోట: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేయడం పట్ల మండలంలోని ఎన్డీయే కూటమి శ్రేణులు బుధవారం సంబరాలు చేసుకున్నారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి పంచి పెట్టారు. బాణసంచా కాల్చారు. సోమవరం గ్రామంలో తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, తాళ్లపాలెం, చింతలపాలెంలో కూడా వేడుకలు జరిపారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఆండ్ర ప్రసాద్, పార్టీ మండల అధికార ప్రతినిధి జెర్రిపోతుల నూకినాయుడు తదితరులు పాల్గొన్నారు.



చింతలపాలెంలో టీడీపీ శ్రేణుల ఆనందం

గ్రామీణ గ్రంథాలయాలకు మహర్దశ

- రూ.13.90 లక్షలతో మరమ్మతులు
- గత ప్రభుత్వంలోనే నిధుల విడుదల
- పూర్తికావచ్చిన పనులు
- పరిశీలించిన అధికారులు

నక్కపల్లి : మండలంలో రెండు గ్రామీణ గ్రంథాలయాలకు మహర్దశ పట్టింది. ఉపమాక, చినదొడ్డిగల్లు గ్రామాల్లో విజ్ఞాన భాండాగారాలుగా విరాజిల్లుతున్న ఈ పుస్తక పఠనాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఈ శిథిల భవనాల్లోనే విధులు నిర్వహించే పరిస్థితి నెలకొంది. శాఖాగ్రంథాలయాలనే తప్ప, మారుమూల గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామీణ గ్రంథాలయాలను పట్టించుకున్న దాఖలాలు లేవు. పాఠకులంతా మండల కేంద్రాలకు వచ్చే అవసరం లేకుండా పేపర్లు, నవలలు, పోటీ పరీక్షలకు హాజరయ్యేందుకు అవసరమైన పుస్తకాలను రిఫ్యా చేసుకునేందుకు గతంలో గ్రామీణ గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. నక్కపల్లి మండలంలో ఉన్న ఈ రెండు గ్రంథాలయాలు పూర్తిగా పాడయ్యాయి. రెండు పెద్ద గ్రామాల్లో ఉన్న ఈ గ్రంథాలయాలకు పాఠకుల సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. రెండు గ్రంథాలయాలకు ఇన్‌చార్జ్‌గా కె.జనార్దన్ వ్యవహరిస్తున్నారు. ఇతని ప్రత్యేక శ్రద్ధతో మండల కేంద్రంలో ఉన్న శాఖాగ్రంథాలయాల కంటే ఎక్కువ ఆదరణ ఈ గ్రామీణ గ్రంథాలయాలకు ఉంది. ఎప్పటికప్పుడు పాఠకులకు అవసరమైన పత్రికలు, పుస్తకాలను సరఫరా చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. వేసవి కాలంలో విద్యార్థుల కోసం ప్రత్యేక సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేసి స్పోకెన్ ఇంగ్లిషు, వివిధ అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్‌పోటీలు ఏర్పాటు చేశారు. దాతల సాయంతో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయాలను ప్రజలకు మరింత చేరువ చేయడం, పాఠకుల సంఖ్య మరింత పెంచాలన్నా, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలతోపాటు, విజ్ఞానాన్ని, వినోదాన్ని ఆధ్యాత్మికతను పెంచేందుకు అవసరమైన మరిన్ని పుస్తకాలు అవసరం ఉంది. ఇవన్నీ సమకూర్చడానికి అవసరమైన దాతలున్నప్పటికీ వసతి సమస్య వేధిస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని గ్రంథాలయాధికారి జనార్దన్ పలుమార్లు ఈ గ్రంథాలయాలను మరమ్మతులు చేయించాలని గ్రంథాలయశాఖ ఉన్నతాధికారులను వేడుకున్నారు. పట్టు వదలని విక్రమార్కునిలా దాదాపు నాలుగేళ్లపాటు ఉత్తర ప్రత్యుత్తరాలు రాయడం, ఇక్కడ వాస్తవ పరిస్థితులను నివేదించడం చేశారు. ఎట్టకేలకు స్పందించిన జిల్లా గ్రంథాలయ శాఖ వారు ఈ రెండు గ్రంథాలయాల మరమ్మతులకు రూ.13.90 లక్షలు విడుదల చేశారు. ఉపమాక గ్రంథాలయానికి రూ.7.20లక్షలు, చినదొడ్డిగల్లు గ్రంథాలయానికి రూ.6.70లక్షలు విడుదల చేయడంతో మరమ్మతు పనులు చేపట్టారు. ఉపమాకలో 90 శాతం పనులు పూర్తయ్యాయని జనార్దన్ తెలిపారు. చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో 50 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ఈ గ్రంథాలయాల మరమ్మతు పనులను బుధవారం ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖకు చెందిన ఇంజినీరింగ్ మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఈఈ రమేష్, డీఈ ప్రసాద్, ఏఈ దాడి సత్యస్వరూప్, జయశ్రీ తదితరులు పరిశీలించారు. త్వరితగతిన మిగిలిన పనులు పూర్తిచేసి త్వరలోనే వీటిలో కార్యకలాపాలు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. జగనన్న ప్రభుత్వం హయాంలో నాడు నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించిన విధంగానే గ్రంథాలయాల మరమ్మతులకు కూడా నిధులు విడుదల చేయడం పట్ల పాఠకులు, పుస్తక ప్రియుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ
అనకాపల్లి జోన్.

ఆర్.సి.నెం.24/2024/ఎ1/జోన్-VII/ జి.వి.యం.సి తేది :12-06-2024

బహిరంగ వేలం ప్రకటన

మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ, అనకాపల్లి జోను నందు గల జనరల్ ఏరియా, హోల్ సేల్ మరియు రిటైల్ కూరగాయల మార్కెట్టు ఆశీలు (గవరపాలెం వద్ద గల రైతు బజారు మార్కెట్టు తో కలిపి) మరియు అనకాపల్లి జోన్ పరిధిలో రోడ్డు, ప్రక్క మార్జిన్లో దిగుమతి అయిన వాటిపై ఆశీలు వసూలు చేసుకునే అధికారమును, చేపల మార్కెట్ మరియు అనకాపల్లి జోన్ నందు మరియు 5 విలీన గ్రామములలో యందు గల చెట్ల ఫలములను అనుభవించు అధికారములను మిగిలిన ఆర్థిక సంవత్సరమునకు గాను అనగా తేది. 01-07-2024 నుండి లేదా ఇచ్చిన తేది నుండి 31-03-2025 తేది వరకు గుత్తకు ఇచ్చుటకు గాను మరియు నగరపాలక సంస్థకు చెందిన ఖాళీగా ఉన్న దుకాణములు 3 సంవత్సరముల కాలమునకు (నెలసరి అద్దె ప్రాతిపదికన) గుత్తకు ఇచ్చుటకు గాను తేది. 22-06-2024న అనగా శనివారం ఉదయం 11-00 గంటలకు అనకాపల్లి జోనల్ కార్యాలయం నందు బహిరంగ వేలం నిర్వహించబడును.

ఇందుకు సంబంధించి ధరావత్తు సొమ్ము, రిజిస్ట్రేషన్ ఫీజు మరియు ఇతర నియమ నిభంధనల కొరకు గజెట్ నోటిఫికేషన్ కాపీను రూ. 300/- లు చెల్లించి జోనల్ కార్యాలయము నుండి పొందవచ్చును మరియు ఇతర వివరముల కొరకు అనకాపల్లి జోనల్ కార్యాలయము నందు జోనల్ కమిషనర్ / రెవెన్యూ అధికారులు / ఎ1 గుమస్తాను కార్యాలయ పని వేళల్లో సంప్రదించవచ్చును.

జోనల్ కమిషనర్,
అనకాపల్లి జోన్, జి.వి.యం.సి